www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 మే 2024

తీవ్ర తాగునీటి సమస్య..

పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి - గంగవరం: మండలంలోని గుండిగల్ పంచాయతీ దళితవాడలో వారం రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు, నాయకులు పట్టించుకోలేదని దళితవాడకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో తాగునీటి బోరు మరమ్మతురుకు నోచుకోక పోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా వుందని తాము తాగునీటి కోసం పొలి మేర్లలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళితే రైతులు దుర్భాషలాడి వెళ్లగొడుతున్నారని, దళిత వాడలో బోరుకు మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఇదే దళిత వాడలో మండలం ఎంపీపీ కూడా ఉన్నారని ఆయన ఈ సమస్యను పట్టించుకోక పోవడం బాధాకరంగా ఉందని వారు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి దళితవాడకు తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.

సుందరయ్య వర్ధంతిని నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు నిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ని స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సిఎంఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత, ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో, పార్లమెంట్‌లో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి నేటి రాజకీయాలకు ఆదర్శంగా నిలిచి ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించిన ప్రజానేత పుచ్చలపల్లి సుందరయ్య మచ్చలేని మహానీయుడు అన్నారు. భారతదేశ తొలి ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య పేదలందరికి అన్నం పెట్టే మార్గం ఎంచుకున్న మహానేత అని, తనకున్న వందల ఎకరాల సాగు భూమిని కడుపేదలకు పంచి, నిరుపేదగా జీవించిన పేదల ప్రేమ మూర్తి అని పేర్కొన్నారు. తన గ్రామం నుండి నెల్లూరు సైకిల్ , కావడిపై సరుకులు తెచ్చి లాభం లేకుండా అసలు ధరలకు అమ్మేవారని, వ్యవసాయ కూలీల కోసం సంఘం పెట్టి కూలీ రేట్లు సాధించారన్నారు. సమాజంలో ఉన్న కుల వివక్ష తమ ఇంటిలో లేకుండా చెయ్యడమే కాకుండా బయట వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపి ప్రజలలో చైతన్యం కల్పించారన్నారు. ప్రజాప్రతినిధి గా సైకిల్ పై పార్లమెంట్ కు వెళ్లి తన నిరాడంబరతను చాటిన నిజాయతీ పరుడు. తెలంగాణా విముక్తి కోసం సాగించిన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. ఆ ఉద్యమానికి రథసారధి అయ్యారని, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అగ్రభాగాన నిలిచి , నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం ఉద్యమించారన్నారు. కార్మిక హక్కుల కై, ప్రభుత్వ రంగ సంస్థ పరిరక్షణ కు, కనీస వేతనం అమలుకు, కార్మిక సంక్షేమానికి ఉద్యమించటం మన ముందున్న అసలు కర్తవ్యం అన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ప్రజా కార్మిక సమస్యలపై బలమైన ప్రజా ఉద్యమం చేయడమే లక్ష్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. అనంతరం సుందరయ్య చిత్ర పటానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు కె సురేంద్రన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, దాము, ప్రసాద్, శివ, లోకానాథం, అయ్యప్ప, రమాకాంత్ పాల్గొన్నారు.

మామిడి..తగ్గిన దిగుబడి!

- మామిడి కోసం ఫ్యాక్టరీల ఎదురుచూపు
- ప్రారంభమైన ప్రాసెసింగ్
- కాదర్ టన్ను రూ.46 వేలు , సింధూరం, తోతాపురి రూ.20 వేలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ ఈ సంవత్సరం ఆలస్యంగా ప్రారంభమైంది. ఇందుకు కారణం వాతావరణ పరిస్థితిలే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మామిడి పూత అంతమాత్రంగానే వచ్చింది. పూత మూడు నాలుగు దఫాలుగా మామిడి చెట్లలో కనిపించింది. దీంతో ఈ పర్యాయం ఆలస్యంగా పంట వచ్చిందని రైతులు చెబుతున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి 20 శాతం పంట కూడా రైతులు మామిడి తోటలో లేకపోవడం గమనార్హం. సాధారణంగా మామిడి ఫ్యాక్టరీల యజమాన్యం మామిడి కాయలను విజయవాడ నుంచి తెప్పించుకుని ముందే ప్రాసెసింగ్ మొదలు పెట్టేవారు. కారణం అక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండి కాయ దిగుబడి బాగా ఉండేది. తక్కువ ధరకి దొరికేది. తరువాత రెండో దఫా మన జిల్లా మామిడి కాయలను ఫ్యాక్టరీ వారు ధర నిర్ణయించి రైతులకు తెలిపేవారు.

తగ్గిన మామిడి దిగుబడి

ఈ సంవత్సరం విజయవాడలోనూ దిగుబడి అంతంత మాత్రమేనని వ్యాపారులు చెబుతున్నారు. కాయ నాణ్యత లేదని వారి వాదన.. అందుకే ఈ సారి జిల్లా ఫ్యాక్టరీ వారు చిత్తూరు జిల్లా రైతుల వద్ద నుంచి మామిడి పంటను కొనుక్కునేందుకు సిద్ధపడుతున్నారు. మండీలకు తరలిస్తే ఫ్యాక్టరీలకు కాయలు రావని వారి ఆలోచన. ఈ సంవత్సరం పంట తక్కువగా ఉన్నా కాయ నాణ్యతలో ఖాదర్, సింధూరం తోతాపురి ఇతర రకాలు మచ్చ లేకుండా నాణ్యతగా ఉన్నాయి.

మామిడి కోసం ఫ్యాక్టరీల ఎదురుచూపు

కార్వేటినగరం మండలం పాదిరికుప్పం వద్ద వున్న మామిడికాయల జ్యూస్ ఫ్యాక్టరీలో ప్రాసెసింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. విజయవాడ నుంచి వచ్చే మామిడి కాయలు నాణ్యత లోపించడంతో ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులను ఆకర్షిస్తోంది. ప్రస్తుత రేట్లు కాదర్ రకం టన్ను రూ.46 వేలు, సింధూరం, తోతాపురి రూ.20 వేలు చొప్పున మామిడి కాయల మండి వ్యాపారులు ప్రస్తుతం రైతులకు చెల్లిస్తున్నారు. ఫ్యాక్టరీ యజమానులు జిల్లాలోని మామిడి పంట దిగుబడిపై ఆశలు పెంచుకుని ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది మామిడి పూత చాలా తగ్గింది. వచ్చిన పూత సైతం నిలవలేదు. వచ్చిన పూత మూడు నాలుగు దఫాలుగా వచ్చింది. జిల్లాలో ఇప్పుడూ మామిడి చెట్లలో పూత అక్కడక్కడా కనిపిస్తోంది. వాతావరణం అనుకూలించక మామిడి పూత రాలిపోయింది. రైతులు ఎన్ని దఫాలు క్రిమిసంహారక మందులు వాడినా ఫలితం లేదు.. పావు భాగం పంట మాత్రమే చేతికి అందింది. కొంత మంది రైతులు మామిడి చెట్లు పూర్తిగా కాపు లేకుండా అంత ఇగురు వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో సుమారుగా 75 శాతం మామిడి పంట దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. జిల్లాలో సుమారు లక్ష 55 వేల ఎకరాల్లో మామిడి పంట ఉన్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇందులో 25 వేల ఎకరాలలో లేత మామిడి తోటలో కాగా, మిగిలిన 1లక్ష 30 వేల ఎకరాలలో కాపు వచ్చి మామిడి చెట్లు ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో సగటుగా ఐదు లక్షల మెట్రో టన్నుల దిగుబడి రావాల్సి వుంది. అయితే పూత రాకపోవడంతో పది శాతం పంట వచ్చే అవకాశం వుంది. సగటున జిల్లాలో ఐదు లక్షల మెట్రో టన్నుల మామిడి దిగుబడి వస్తుంది. అయితే ఈ సంవత్సరం ఒకటి లేదా రెండు లక్షల మెట్రో టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా పంట చాలా వరకు నేలరాలింది. తూర్పు మండలాలలో ఎక్కువ విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా పండిన పంట చిత్తూరు దామలచెరువు, బంగారుపాళ్యం , పుత్తూరు, తిరుపతి కేంద్రాలలో మామిడి కాయల మండీలు వున్నాయి. ఇక్కడి నుంచి కలకత్తా, ఢిల్లీ ముంబై వంటి కేంద్రాలకు వ్యాపారులు రైతుల వద్ద కొనుక్కుని ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో మామిడి పంట ఆశాజనకంగా లేదు. దీంతో ప్రారంభమే నిరాశ జనకంగా అయింది. జనవరి నుంచి మంచు ఎక్కువగా కురవడం మామిడి పూత రాలిపోయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇలా పంట పూర్తిగా దెబ్బతిని జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో మామిడి పంట నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వాస్తవానికి మామిడి సాగు పైనే రైతులు ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. జనవరి నుంచి మందుల పిచికారీకి 40 వేల నుంచి 60 వేల వరకు ఒక ఎకరానికి ఖర్చు అవుతోంది. గత రెండు సంవత్సరాలుగా రైతులు వాతావరణ పరిస్థితులు సరిగా లేక మందులు పిచికారీకి పెట్టిన పెట్టుబడి సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ప్రభుత్వం మామిడి రైతులకు బీమా కల్పించడంలో విఫలమైందని రైతులు చెబుతున్నారు. జిల్లా మండలాల్లోని రైతు భరోసా కేంద్రాలలో ఇప్పటి వరకు మామిడి పంటకు బీమా వర్తించలేదని చెబుతున్నారు.

ప్రాసెసింగ్ ప్రారంభమైన పాదిరికుప్పం మామిడికాయల జ్యూస్ ఫ్యాక్టరీ

ప్రభుత్వం ఆదుకోవాలి

మండలంలో ఉద్యానవన పంటల్లో అధిక భాగం రైతులు మక్కువ చూపించే పంట మామిడి పంట. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ సంవత్సరం పంట ఆశాజనకంగా లేదు. పూర్తిగా ఇగురు వచ్చింది. కాపు లేదు.. పంటపై పిచికారి చేసిన సొమ్ము కూడా రాలేదు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- దేశయ్య, మామిడి రైతు, వెదురుకుప్పం మండలం.

పర్యవేక్షించి సలహాలు ఇవ్వాలి

మండలంలో రైతులు మామిడి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి రైతులకు ఏ ఏ సమయంలో ఏఏ మందు పిచికారి చేయాలో చెప్పాలి. మామిడి పండుపై అవగాహన కల్పించాలి. అధికారులు గ్రామ గ్రామాలలో పర్యటించాలి.

- సువాల ఆనంద రెడ్డి, వెంకటరెడ్డి ఊరు, వెదురుకుప్పం మండలం.

ఫ్లై ఓవర్‌పై చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

- ఫ్లైఓవర్‌పై ప్రమాదకరం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -పలమనేరు:

చిత్తూరు జిల్లా పలమనేరు నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద గల సర్వీస్ రోడ్డు లో వర్షపు నీరు చెరువును తలపిస్తోంది. దీంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద గల సర్వీస్ రోడ్డు లో చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డు ఎత్తు తక్కువగా ఉండటం వల్ల, గుంతలమై ఉండవల్ల కొద్దిపాటి నీరు వస్తే చెరువును తలపిస్తూ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ విషయమై అనేకమార్లు ప్రజా ప్రతినిధుల దృష్టికి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీనివల్ల గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింద. కనీసం ప్రమాద సూచికలు కూడా లేనందు వల్ల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు తగు శ్రద్ధ తీసుకొని ఈ రోడ్డుకు మరమ్మతులు చేసి అక్కడ ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేస్తే ప్రజల ప్రాణాలకు రక్షణ వుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఎస్వీ సెట్ స్ట్రాంగ్ రూమ్ భద్రతను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ షన్మోహన్

ఎస్‌విసెట్ స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా

- కేంద్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రత
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు 2024 ముగిసిన అనంతరం ఈవీఎంలను పూతలపట్టు మండలం ఎస్‌వి సెట్ ఇంజినీరింగ్ కళాశాల లో స్ట్రాంగ్ రూములలో భద్ర పరిచినట్లు కేంద్ర బలగాలతో కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా జేసీ పి శ్రీనివాసులు తో కలిసి ఎస్‌వి సెట్ స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో సంతకం చేసిన కలెక్టర్ పోలీస్ అధికారులతో కలిసి భద్రత ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు- 2024 ముగిసిన అనంతరం జిల్లాకు సంబంధించి పోల్డ్ అయిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్‌లు, బ్యాలెట్ యూనిట్‌లు, వివిప్యాట్‌లు, స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు మధ్య భద్రపరిచామని, మూడంచెల భద్రతా వ్యవస్థతో పటిష్టమైన భద్రత వ్యవస్థ వుందన్నారు. దీంతో పాటు భద్రత విషయంలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావు లేకుండా అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో వుందనన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర బలగాల తో మూడంచెల భద్రత వ్యవస్థ వుందని, దీంతో పాటు నిరంతర నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూములకు నిరంతర నిఘాలో భాగంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేశామని దాదాపు 80 సిసి కెమెరాల ద్వారా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు, చిత్తూరు పార్లమెంటుకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను మానిటరింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ ఉన్నందున అందుకు సంబంధించి పటిష్టమైన బ్యారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఓ బి పుల్లయ్య, పూతలపట్టు ఆర్‌ఓ చిన్నయ్య, టిడిపి ప్రతినిధి సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

- తిరుమలలో కొనసాగుతున్న యాత్రికుల రద్దీ
- టీటీడీ విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమలలో మూడు రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. మూడో రోజూ ఆదివారం ఔటర్ రింగ్ రోడ్డులోని ఆక్టోపస్ వద్ద నుండి క్యూలైన్లు కొనసాగుతున్నాయి. వేసవి సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులతో తిరుమల పోటెత్తింది. దేశవ్యాప్తంగా విద్యార్థులకు దాదాపు అన్ని పరీక్షలు పూర్తయినందున సాధారణంగా మే నెలలో అధిక రద్దీ ఉంటుంది. ఇందులో భాగంగా వేసవి సెలవుల రద్దీ శుక్ర, శని, ఆదివారాలలో గరిష్ట స్థాయికి చేరుకుంది. టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు, జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్యశాఖల ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను, క్యూలైన్లను నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగునీరు అందించేందుకు టీటీడీ విస్తతమైన ఏర్పాట్లు చేసింది. శ్రీవారి సేవకులు అన్నప్రసాదం, ఆరోగ్య, విజిలెన్స్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని కీలక ప్రదేశాల్లో దాదాపు 1500 మంది 24/7 సేవలందిస్తున్నారు. కృష్ణతేజ సర్కిల్ వరకు వివిధ ప్రాంతాలలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. వైద్య బృందాలు బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నివేదికల ప్రకారం ఆక్టోపస్ సర్కిల్‌లో లైన్‌లోకి ప్రవేశించే భక్తులకు దాదాపు 24 గంటల సమయం పడుతోంది.

డీజేలకు అనుమతి లేదు

చిత్తూరు గంగమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలనలో ఎస్పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని గంగమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలనలో ఎస్‌పి మణికంఠ పేర్కొన్నారు. చిత్తూరు పట్టణంలోని బజార్ వీధిలో నిర్వహించనున్న నడివీధి గంగమ్మ జాతరకు సంబంధించిన ప్రాంతాలను ఎస్‌పి గంగమ్మ ఆలయ ధర్మకర్త సతీమణి సికెలావణ్య, చిత్తూరు సబ్-డివిజన్ డిఎస్పి రాజగోపాల్ రెడ్డితో కలిసి చర్చి వీధి, బజార్ వీధి, శివాలయం వీధి, డీజే నిర్వహిస్తున్న మ్యాక్స్ షోరూం, అమ్మవారిని నిమజ్జనం చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఏటా చిత్తూరు పట్టణంలో గంగమ్మ జాతర ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని, ఈ సంవత్సరం కూడా జాతరకు తగిన పోలీస్ సిబ్బందితో పాటు, అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జాతర నిర్వహించే ప్రదేశాలలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తామని తెలిపారు. పిక్ పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ నిఘా కేంద్రం ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. జాతర సందర్భంగా మ్యాక్స్ షోరూం వద్ద నిర్వహిస్తున్న డీజే కార్యక్రమాలు 'మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్' అమలులో ఉన్నందున శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని డీజే కార్యక్రమాలకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున జాతర సమయంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా జాతర సజావుగా జరిగేందుకు సహకరించాలని లేని పక్షంలో అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం చిత్తూరు సబ్-డివిజన్ కార్యాలయంలో పట్టణ అధికారులతో సమావేశమై జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యల పై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ ఆలయ ధర్మకర్త సతీమణి సికె లావణ్య, చిత్తూరు సబ్-డివిజన్ డిఎస్పి రాజగోపాల్ రెడ్డి, ట్రైనింగ్ డిఎస్పీ పావన్ కుమార్, 1వ పట్టణ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ రెడ్డి, 2వ పట్టణ ఇన్‌స్పెక్టర్ ఉలసయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్య బాబు, జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

చిత్తూరు జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్‌పి మణికంఠ

అంబరాన్ని అంటిన గంగమ్మ జాతర ఉత్సవాలు

- వైభవోపేతంగా శోభాయాత్ర
- ఆకట్టుకున్న కళా ప్రదర్శన

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్

గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు అంబరాన్ని అంటుతున్నాయి. జాతరలో భాగంగా టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వైభవోపేతంగా శోభాయాత్ర నిర్వహించారు. తిరుపతి తొలి గడప అయిన అనంత వీధి నుంచి ప్రారంభమైన యాత్ర పట్నూలు వీధి, రామచంద్ర పుష్కరిణి, ప్రకాశం రోడ్డు, కృష్ణాపురం ఠాణా, గాంధీ రోడ్డు, బండ్ల వీధి ప్రాంతాల నుంచి గంగమ్మ ఆలయం వరకు కొనసాగింది. భక్తులు తమ భక్తి విశ్వాసాలు చాటుతూ, గంగానది ప్రవాహంలా పరవళ్లు తొక్కారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక భక్తి చైతన్య యాత్రను నిర్వహించే సంప్రదాయం గతకొంత కాలంగా కొనసాగుతోంది. ఇదే క్రమంలో స్థానిక అనంతవీధిలో గంగమ్మ తల్లికి భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో భక్తులు గంధం కుంకుమ బొట్లు పెట్టుకుని, వేపాకు ధరించి మాతంగి వేషంతో పాటు పౌరాణిక వేషధారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్ర ఆద్యంతం భక్తులు పసుపు నీళ్లు కుమ్మరిస్తూ, కర్పూర హారతులిస్తూ స్వాగతించారు. నవదుర్గలు, తప్పెటగుళ్ళు, డప్పులు, తీన్ మార్, కీలు గుర్రాలు, కొమ్ము కొయ్య, దింసా, పగటి వేషగాళ్లు, పులి వేషాలు, గరగల్లు, బోనాల కళా ప్రదర్శనలు ఆకర్షించాయి. టీటీడీ చైర్మన్ భూమన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం తర్వాత గంగమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా జరుగుతోందని, గంగమ్మ తల్లి ఆలయాన్ని మరింత తీర్చిద్దడానికి అమ్మ భక్తులుగా ఎళ్లవేళలా కృషి చేస్తామని అన్నారు. భవిష్యత్‌లో మరింత గొప్పగా జాతర నిర్వహిస్తామని, గత మూడు సంవత్సరాలుగా శోభాయాత్రలో పెద్దఎత్తున భక్తులు పాల్గొంటూ భక్తి ప్రపత్తులు చాటుతున్నారని అన్నారు. జాతరలో ఐదవ రోజైన ఆదివారం భక్తులతో ఆలయం, ఊరు అంతా కిటకిటలాడడం జరిగిందన్నారు. భక్తులు అనేక రూపాల్లో విచ్చేస్తూ గంగమ్మ నామ స్మరణ చేస్తూ తిరుపతి పురవీధులు మారు మోగించారు. మేయర్ శిరీష పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమీక్షించిన కమిషనర్

తిరుపతి టౌన్: తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర ఏర్పాట్లపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగినచర్యలు తీసుకుంట్టున్నట్లు తెలిపారు. క్యూలైన్ల నిర్వహణ పక్కాగా వుండాలన్నారు. ఆలయపరిసర ప్రాంతాలు, చుట్టుపక్కల పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు చేపట్టామని, బ్లీచింగ్ చల్లిస్తున్నామని, ఆలయం లోపల అత్యవసర మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆలయ పరిసరాల్లో భక్తులకు తాగునీరు ఏర్పాట్లు చేయిస్తున్నామని, లైటింగ్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంట్టున్నామని వివరించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించామని, మంగళవారం జరిగే జాతరకు ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. గంగమ్మ ఆలయ ఈవో మమత, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిఐ మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డీఈ సంజయ్ కుమార్, శానిటరి సూపర్‌వైజర్లు చెంచెయ్య, సుమతి, ఎలక్ట్రికల్ ఏఈ నరేంద్ర పాల్గొన్నారు.

బొప్పాయి సాగు.. లాభాలు బాగు..

- మూడు అడుగులకే కాపు - అంతర్ పంటగా సాగు

ప్రజాశక్తి -గంగవరం: కొత్తరకం బొప్పాయి సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. మూడు అడుగులకే బొప్పాయి కాపుకొస్తోంది. అంతర్ పంటగా రైతులు దీన్ని సాగు చేస్తున్న రైతు శ్రీనివాసరెడ్డి ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గతంలో బొప్పాయి సాగు మొక్క నాటిన తర్వాత సంవత్సరం వరకు కాపు వచ్చేది కాదని ప్రస్తుతం ఆరు నెలలకే పంట కాస్తోందని, మూడు అడుగులు మొక్కలు కాపు కాస్తున్నాయని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇతర కూరగాయల పంటలకు ధరలు లేకపోవడంతో ఏదైనా దీర్ఘకాలిక పంటలు వేద్దామని ఆశతో ఈ బొప్పాయి సాగు ప్రారంభించామని ఈ మొక్కలు కర్ణాటక నుండి కొనుగోలు చేసి మొక్కకు 20 రూపాయలు చొప్పున కొని రెండు ఎకరాలు చేశామని రైతు పేర్కొన్నాడు. మొక్క నాటిన వెంటనే అంతర్ పంట కర్బూజా పండించి

మూడు అడుగులకే పంట కొచ్చిన బొప్పాయి మొక్క

కొంత రాబడి సంపాదించుకున్నామని ఆ డబ్బుతోనే పంటకు కావలసిన ఎరువులు క్రిమి సంహారక మందులు సరిపోయాయని ఈ బొప్పాయి పంట రెండు సంవత్సరాల దాకా కాపు ఉండి పది అడుగుల దాకా పెరుగుతుందని తెలిపాడు. ప్రస్తుతం బొప్పాయి కిలో పది రూపాయల నుండి 15 రూపాయల వరకు ఉందని తాను చేసిన పంట ఇక రెండు నెలల్లో కోతకు వస్తుందని పంట పూర్తి అయ్యే లోపు 50 టన్నుల దాకా రాబడి వస్తుందని దీంతో తనకు ఊరట కలుగుతుందని ఆయన పేర్కొన్నాడు. గతంలో టమోటా కీర, బీర పంటలు చేసేవారని ఇవి ధరలు లేక పోవడంతో పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయామని వాపోయాడు. ఈ బొప్పాయి సాగుతో అప్పులు తీరే అవకాశం ఉందన్న ఆశతో సాగు చేస్తున్నామని రైతు పేర్కొన్నాడు.

కుప్పం గంగమ్మ జాతర భద్రతా ఏర్పాట్ల పరిశీలన

కుప్పంలో గంగ జాతర భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి మణికంఠ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కుప్పం పట్టణంలో జరగనున్న గంగమ్మ జాతరకు సంబంధించిన ప్రాంతాలను ఎస్పీ మణికంఠ కుప్పం సబ్-డివిజన్ డిఎస్పి శ్రీనాథ్ తో కలిసి అమ్మవారి దర్శనం చేసుకొని కుప్పం పుర వీధులు జాతర నిర్వహించే అన్ని ప్రాంతాలను ఆదివారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఏటా కుప్పం పట్టణంలో గంగమ్మ జాతర ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం సైతం జాతరకు తగిన పోలీస్ సిబ్బందితో పాటు, అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నియంత్రణలో బాగంగా జాతర నిర్వహించే ప్రదేశాలలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తామని తెలిపారు. పిక్ పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ టీమ్ ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎలాంటి డిజెలు అనుమతించమని, జాతర సమయంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక లాపాలకు పాల్పడకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా జాతర సజావుగా జరిగేందుకు సహకరించాలని లేని పక్షంలో అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని తెలిపారు. అనంతరం కుప్పం సబ్-డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై జాతరను ప్రశాంతంగా నిర్వహిం చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం సబ్-డివిజన్ డిఎస్పి శ్రీనాథ్, కుప్పం అర్బన్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వి రమణ, సబ్ డివిజన్ ఎస్‌ఐలు, జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

ఐదు గురికి గాయాలు

ప్రజాశక్తి - వికోట: ద్విచక్ర వాహనాలను కారు ఢీకొనడంతో ఐదుగురు గాయాల పాలైన సంఘటన వికోట మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..తమిళనాడు రాష్ట్రం పేర్నం బట్టు వైపు నుండి వికోట వైపు వెళుతున్న కారు ప్రమాదవశాత్తు బంగ్లా ఊరు సమీపంలో అదే గ్రామానికి చెందిన కందస్వామి కుమారుడు వీరభద్ర ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తప్పించబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న పాముగానిపల్లె పంచాయతీ గుమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు ఆనంద్ కుమార్ (40), ఆయన భార్య హేమావతి(37), వారి కుమారులు వైభవ్(10), నేహాంత(3) లను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను గ్రామస్తులు వి కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 సాయంతో మెరుగైన వైద్యం కోసం కుప్పంకు తరలించారు. వికోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం తిరుపతి రుయాస్పత్రిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ మల్లప్ప కథనం మేరకు కీరమంద గ్రామానికి చెందిన రాజేంద్ర కుమారుడు నాగభూషణం ఈనెల 15వ తేదీ బుధవారం పాడి ఆవులకు మేత కోసం సదుం మండలానికి వెళ్లి అక్కడి నుండి ట్రాక్టర్లలో ఎండు గడ్డిని లోడ్ చేసుకుని తిరిగి వస్తుండగా మొగిలి ఘాటు వద్ద ట్రాక్టర్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాద సమయంలో ఆరుగురు వుండగా ఉండగా ఇద్దరు అదే రోజు మృతి చెందారు. గాయపడిన నాగభూషణంకు ప్రథమ చికిత్స బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రి చేపట్టి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం ఆ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరులో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు సిపిఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఐద్వా చిత్తూరు జిల్లా కార్యదర్శి భువనేశ్వరి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నిజాయతీకి మారుపేరుగా ఉదహరించే మహానాయకులలో ఒకరని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, సిపిఎం వ్యవసాయ సంఘం కార్యదర్శి ఓబుల్ రాజుమాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు అంజి శ్రీ రామయ్య, సంజయ్ శర్మ, నరసింహులు, లక్ష్మయ్య, మహిళా సంఘాల నాయకులు ఖైదీనిషా, సరోజమ్మ, ధనమ్మ, జయంతి, హరి పాల్గొన్నారు.

తగ్గిన వేడి.. తెలియని నాడి!

ప్రజాశక్తి -వి కోట : ఓ పక్క మండే వేసవి ఎండలు.. మరో పక్క ఎన్నికలలో రాజకీయ పార్టీల నేతల వాడి వేడి మాటల తూటాలతో వేడెక్కిన పలమనేరు నియోజకవర్గ ప్రజలు వర్షాల రాకతో వాతావరణం చల్లబడగా, ఎన్నికల పోలింగ్ ముగియడంతో రాజకీయ వేడి తగ్గి ప్రశాంత వాతావరణం నెలకొంది. ఈ సంవత్సరం ఎన్నడూ లేని విధంగా పలమనేరు నియోజకవర్గం ప్రాంత ప్రజలు 43 డిగ్రీల ఎండలకు అల్లాడిపోయారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ప్రజలు సాధారణ జీవనానికి అలవాటు పడిపోయారు. మరో పక్క గత కొద్ది నెలలుగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీపడిన ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల వేడిని నియోజకవర్గంలో రాజేశాయి. అధికార వైసిపి తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటే గౌడ 'గడపగడపకు వైసిపి' పేరుతో ప్రజల్లో కలియతిరిగి ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ఒక దశలో వారికి ఈ సారి ఎమ్మెల్యే టికెట్ రాదన్న ప్రచారం నియోజకవర్గంలో ఎన్నికల వేడిని మరింత కాక పుట్టించాయి. చివరకు తనదైన శైలిలో టికెట్ సంపాదించి ప్రజాక్షేత్రంలో ప్రతిపక్షాలకు ధీటుగా ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి, వౌసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని నియోజకవర్గానికి రప్పించి ప్రచారం నిర్వహించి ప్రజల్లో తన పట్టు సడలకుండా ప్రయత్నించారు. మరోపక్క రాష్ట్ర మాజీ మంత్రి, సీనియర్ నాయకులు అమరనాథ్ రెడ్డి నియోజకవర్గంలో రాజకీయాల్లో తనదైన శైలిలో ప్రచారాలు నిర్వహించారు. పార్టీలో అన్ని వర్గాలను ఒక్క తాటిపై కి తీసుకొచ్చి అన్ని వర్గాలను ఒకటి చేసి తన ప్రత్యేకతను చాటుకున్నారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ..' పేరిట 'ఇంటింటికి టిడిపి ' కార్యక్రమాన్ని నియోజకవర్గంలో చేపట్టి తనదైన శైలిలో ప్రచారాన్ని కొనసాగించారు. టిడిపి యువ నేత నారా లోకేష్ నిర్వహించిన ప్రజా గళం పాదయాత్రను ముందుండి నియోజక వర్గంలో విజయవంతం చేయించారు. అధినేత నారా చంద్రబాబు నాయుడును పలమనేరు నియోజక వర్గానికి రప్పించి ప్రచారాన్ని నిర్వహించి కార్యకర్తల్లో మనోస్థైర్యం నింపారు. వీటికి తోడు ఇరు పార్టీల్లో పేరున్న నేతల పార్టీ ఫిరాయింపులు, చోటా మోటా నాయకుల జంప్ జిలానీలకు అవకాశం కల్పించి నియోజక వర్గంలో రాజకీయ వేడి రాజేశారు. వీరికి తోడు కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్ తనదైన శైలిలో ప్రచారం నిర్వహించి ప్రజలను ఆకట్టుకున్నారు. బీఎస్పీ, విసి కే పార్టీల అగ్రనేతలు నియోజకవర్గంలో తమదైన శైలిలో ప్రచారం నిర్వహించారు. 2019లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో 67 శాతం నమోదైన పోలింగ్ ఈ సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతానికి పెరిగింది. ఓటర్లలో వెల్లువిరిసిన చైతన్యం చాప కింద నీరులా ఎన్నికల వేడిని చల్లార్చింది. చైతన్యవంతమైన పలమనేరు నియోజకవర్గ ఓటర్లు తమ ఓటు అనే ఆయుధంతో ఎవరికి పోటు పొడిచారు..ఎవరిని అందలం ఎక్కించారు? అన్న చర్చలతో రాజకీయ పార్టీల నేతలు మునిగిపోయారు. ప్రధానంగా అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు తమ గెలుపు పై ధీమాను వ్యక్తపరుస్తున్నారు.

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గురువులకు సన్మానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 1982-83వ సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యా ర్థులు అప్పటి గురువులను ఆదివారం ఘనంగా సన్మానించారు. గురువులు సుబ్రహ్మణ్యం, లలిత, శారద, శకుంతల, తదితరులను పూలమాలతో గౌరవించి పట్టు వస్త్రాలు అందించి గురువుల నుంచి ఆశీర్వాదం పొందారు. గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గడచిన విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మెరుగైన వసతుల కోసం చేయూత అందిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, లోకనాథరెడ్డి, చంద్రన్, నిత్యానందం నాయుడు, రవీంద్రనాయుడు, జయచంద్ర నాయుడు, రెడ్డప్పరెడ్డి, ఉషశ్రీ భారతి, కళ్యాణి, పప్పీ, కస్తూరి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: నేటి నుంచి మండలంలో వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు వారి పంచాయతీల పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాఫీబా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్ 2024 సీజన్లో మండల వ్యాప్తంగా 1980 క్వింటాళ్ వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ తో రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. పెద్దకాప్పలి మినహా మిగిలిన అన్ని రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తన కాయలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు డబ్బులు చెల్లించి పర్మిట్ పర్మిట్లు పొందవచ్చన్నారు. వేరుశనగ ఒక బస్తా (30 కేజీలు)ధర 1710 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోడానికి తమ ఆధార్, 1 బి నకలును, మొబైల్ ఫోన్ తీసుకొని ఆయా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. పెదకాపల్లె రైతు భరోసా కేంద్రంలో ఈ నెల 25 వ తేదీ నుండి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వేరుశనగ విత్తనాల పంపిణీ ఈ నెల 23వ తేదీ నుండి మండలంలో ప్రారంభం అవుతుందన్నారు. రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సోమల మండల వ్యవసాయాధికారి సుధాకర్

సోమల: మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు రాయితీ వేరుశనగ విత్తన పంపిణీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమ, మంగళ, బుధ వారాలలో మూడు రోజులపాటు చేపట్టనున్నట్టు వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. ఆదివారం 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ఈనెల 22 23 24 తేదీలలో ప్రభుత్వం అందించే రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ కోసం 13 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతు భరోసా కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని వేరుశెనగ విత్తనాలు కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ కోసం పాసుపుస్తకం ,ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తమ వెంట తీసుకురావాలని రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సీలు వేసిన టోకెన్ అధికారులు అందిస్తారని ఆ టోకన్ ను, మొబైల్ ఫోను తమ వెంట తీసుకువచ్చి 23వ తేదీ నుండి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. వేరుశనగ విత్తనాలు 30 కేజీల బస్తా 40 శాతం రాయితీ పోను1710 రూపాయలని, నారాయణి రకం1746 రూపాయలుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని సాయినగర్ కళామందిర్ ఆధ్వర్యంలో 18 మంది పిల్లలకు ఆదివారం వినికిడి యంత్రాలు పంపిణీ చేసినట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసి నాధం నాయుడు తెలిపా రు. డాక్టర్ మాధవి రాజారెడ్డి పిల్లలను పరిశీ లించి మాట వినబడని సమస్య వున్న పిల్లలకు ఆరు లక్షల రూపాయల విలువ చేసే యంత్రాలను పంపిణీ చేశారు. ఈ వినికిడి యంత్రాలను బెంగుళూరు జాయినింగ్ సంస్థ అందించినట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా ఇలాంటి సమస్య వున్నవారు తమ దృష్టికి తెస్తే వారికి ఈ యంత్రాలను అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు తులసినాధం నాయు డు, నిర్వాహకులు విజయ్ ధనంజయలు పలువురు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలు పంపిణీ చేసిన నిర్వాహకులు

రాయలసీమ విద్యాసంస్థల అధినేతకి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండల నాయకులు తిరుపతి లోని రాయల సీమ విద్యా సంస్థల అధినేత ఆనందరెడ్డి కి పుష్ప గుచ్చాన్ని అందించి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజ యులు రెడ్డి నేతృత్వంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట నచ్చుకూరు ప్రభాకర్ రెడ్డి , వైసిపి విద్యార్థి విభాగం జీడి నెల్లూరు అధ్యక్షుడు మార్ల సుధాకర్ రెడ్డి, తూకివాకం మహి ,హేమంత్ కుమార్ రెడ్డి ఉన్నారు.

ఆనందరెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: వరి నూర్పిడి యంత్రంలో మహిళ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన సంఘటన ఆదివారం బంగారుపాళెం మండలంలోని రాగి మాను పెంట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు..రాగి మాను పెంట గ్రామానికి చెందిన వెంకటేష్ భార్య హంస వేణి వరి నూర్పిడి యంత్రం వద్ద పనులు చేస్తుండగా అందులో తలకున్న వెంట్రుకలు తగులుకొని తలకు గాయాలయ్యాయి. సమీపంలో ఉన్నవారు గమనించి యంత్రాన్ని ఆపి ఆమెను ప్రమాదం నుండి రక్షించారు. ఆమెను బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న బాధితురాలు హంసవేణి

ఘనంగా 'అమ్మ ఇంటర్నేషనల్ స్కూల్' ప్రారంభం

ప్రజాశక్తి- వికోట : మండల కేంద్రమైన వికోటలో ఆదివారం 'అమ్మ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల' ను ఆదివారం నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, పుర ప్రముఖులు, అతిథులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని సాయి గార్డెన్ సమీపంలో ఇండస్ వ్యాలీ స్కూల్ సహకారంతో మండల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను తక్కువ ఫీజులతో అందించడమే లక్ష్యంతో నూతన పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు కరస్పాండెంట్ లక్ష్మీపతి తెలిపారు. విద్యుత్ తో పాటు మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ఎల్కేజీ , యూకేజీ విద్యార్థులకు ఉచితం గా, ఆపై తరగతి విద్యార్థులకు 15 రూపాయలకు అల్పాహారాన్ని పాఠశాలలోనే అందిస్తున్నట్లు వారు తెలిపారు. మారు మూల ప్రాంతమైన వికోట మండల విద్యార్థులకు మానసిక, శారీరక దృఢత్వం ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత కలుగుతుందన్న లక్ష్యంతో ప్రయోగాత్మకంగా దీన్ని ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను ప్రజలకు అందిస్తున్న అమ్మ ఇంటర్నేషనల్ స్కూల్ ను ఆదరించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖులను , ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

మాట్లాడుతున్న ' అమ్మ' ఇంటర్నేషనల్ స్కూలు కరస్పాండెంట్ లక్ష్మీపతి

విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

క్రికెట్ టోర్నమెంట్ విజేత నంజంపేట యాంగ్రీ ఫైటర్స్

ప్రజాశక్తి -సోమల:

సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌లో నంజంపేట యాంగ్రీ ఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్ గా నంజంపేట వారియర్స్ జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్ లోమొత్తం ఎనిమిది టీమ్స్ పాల్గొనగా మిగిలిన అన్ని టీమ్‌లకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఏబీఎమ్ ఈ స్కూటర్స్ హబ్ అధినేత, నంజంపేట ఓల్డ్ స్టూడెంట్ మొగల్ అన్వగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో అజయ్, గణేష్, హరీష్ ,పృథ్వి, నాని, చాను , పాల్గొన్నారు.

హెచ్‌ఐవి పై అప్రమత్తంగా ఉండాలి

ఉప వైద్యాధికారి విజయ్ కుమారి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: హెచ్‌ఐవి పై అప్రమత్తంగా ఉండాలని ఉప వైద్యాధికారి విజయ్ కుమారి అన్నారు. ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ హెచ్‌ఐవి లైట్ మెమోరియల్ డే కార్యక్రమం ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు ఆధ్వర్యంలో బంగారుపాళెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవి ప్రాణాంతకమైన జబ్బుని హెచ్‌ఐవి సోకిన వారు ఐ సి టి ఎస్ కేంద్రంలో పరీక్షలు చేపట్టి తగిన మందులు వాడితే జీవిత వ్యవధి పెంపొందించుకోవచ్చని హెచ్‌ఐవి నిశ్శబ్ద విప్లవంగా ఉండి ప్రాణం ని గడుస్తుందని కావున ప్రతి ఒక్కరు హెచ్‌ఐవి పరీక్షలు చేసుకుని వ్యాధి నిర్ధారణ తెలుసుకోవాలన్నారు అనంతరం క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిపిఎమ్ఓ మని స్టాఫ్ నర్స్ మంజుల రిజ్వాన సిబ్బంది ఆశా వర్కర్ భువన, ద్రాక్షాయని, జాభీనా , గోపాల్, దాస్ పాల్గొన్నారు.

కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్:

గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని సి.వి.సి పార్కులో ముఖ్యఅతిథి వాకాటి రామ మోహన్ ద్వారా ప్రత్యేక ప్రతిభావంతులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జేవివి గత 32సంవత్సరాలుగా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంచుతూ అనేక కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడే విధంగా చేస్తుందన్నారు. గత పది సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలు కూడా చేయటం అభినందనీయం అన్నారు. ప్రతి నెల ప్రభుత్వ హాస్పిటల్‌లో గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ చేయడం, ప్రతినెల మూడవ ఆదివారం వికలాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం తమ సంస్థకి ఎంతో గర్వకారణమని చెప్పారు. కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన జే.వి.వి ఉపాధ్యక్షుడు రామమోహన్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, రామ మోహన్, జగదీష్, నక్క గోపి, గుర్రం విజయ్ బాబు, శ్రీనివాస్ ఆచారి, రాజేష్, పవన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌కు వైసిపి నాయకుల నివాళి

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎస్ఆర్‌పురం మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ వెంకటాపురం సర్పంచ్ ఏకాంబరం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇడుపులపాయలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రామస్తులతో కలిసి ఇడుపులపాయకు వస్తున్నామని, ప్రతి పేదవాడి గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నతమైన వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. వారి వెంట గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

పజాశక్తి - పుత్తూరు టౌన్:

రూరల్ మండలంలోని కృష్ణసముద్రం గ్రామంలో సి.అన్బు కుమార్ (45) పిడుగు పాటుకు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3గంటల నుంచి 4గంటల మధ్య రామసముద్రం చెరువు నందు ఆవులు మేపుచుండగా ఆకస్మాతుగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతను చనిపోవడంతో దిగువ కృష్ణ సముద్రం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జర్నలిస్టులపై దాడుల్ని ఖండిస్తున్నాం..

✦ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ వెల్లడి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

రాష్ట్ర వ్యాప్తంగా జర్నిటిస్టులపై జరుగుతున్న దాడుల్ని ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంజనేయులు వెల్లడించారు. ఆదివారం స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిని జిల్లా స్థాని సమావేశానికి జిల్లా అధ్యక్షులు జి.శ్రీధర్, కార్యదర్శి వి.గోవి, మునిరాజా, దినకరన్ శ్రీనివాసులు, జయకుమార్, తులసీరామ్, మల్లెల వాణి, జయపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులు చిన్న, పెద్ద పత్రికలు, మీడియాల్లో పనిచేస్తున్న అందరూ సమానమే అని, ఎవరిపై దాడి జరిగినా తాము ముందుండి పోరాడుతామన్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులను విచారించి జరిగిన విషయంపై తప్పొప్పులను తెలుసుకొని న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అలాగే జర్నలిస్టులు ప్రధానంగా ఎదుర్కొంటున్న అక్రిడేషన్, హెల్త్‌కార్డు, పింఛన్లు తదితరాలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే వర్కింగ్ జర్నిలిస్టులకు అందేలా పోరాటం చేయడమే ధ్యేయమన్నారు. దీనిపై నేటి నుంచి ఆగస్టు వరకు తమ ఫెడరేషన్ సభ్యత్వాలను పెంచి, ఆగస్టులో మహాసభ ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతున్నామని పిలుపునిచ్చారు. సమావేశంలో సభ్యులు నరసింహులు, రాధాకృష్ణ, గౌస్, భాస్కర్, సుకుమార్, వెంకటేశ్వరరావు, పాటూరు సురేంద్ర, సుధీర్ పాల్గొన్నారు.

పుష్ప పల్లకిలో వాసవి మాత విగ్రహం ఊరేగింపు

ప్రజాశక్తి -సోమల:

మండల కేంద్రమైన రామసముద్రం బజారు వీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని ఆదివారం రాత్రి పుష్ప పల్లకిలో పురవీధులలో ఊరేగించారు. వాసవి మాత జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ రోజు ఆదివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, శంకరాచార్యుల విగ్రహాన్ని పుష్ప పల్లకిలో ఉంచి పురవీధులలో ఊరేగించగా గ్రామంలోని